క్లుప్తంగా

నేడు గ్రామ సభ

ఎర్రగుంట్ల : వేంపల్లి నుంచి చాగలమర్రి వరకు రోడ్డు విస్తరణకు అధికారులు భూ సేకరణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులు అధ్యక్షతన శుక్రవారం ఎంపీడీఓ సభా భవనంలో గ్రామ సభ నిర్వహించనున్నట్లు యర్రగుంట్ల తహసీల్దార్ ఏ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యర్రగుంట్ల హనుమనుగుత్తి, పోట్లదుర్తి, పెద్దనపాడు, కోడూరు గ్రామాల రైతులకు హాజరు కావాలని కోరారు.

కొనసాగుతున్న అంగన్వాడీల నిరసనలు

కమలాపురం : తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు చేస్తున్న నిరసనలు కొనసాగుతున్నాయి. గురువారం 31వ రోజు స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసనలు తెలిపారు. ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల డిమాండ్లు పరిష్కరించాలన్నారు.

నేడు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలోని దినేష్ మెడికల్ సెంటర్ (ఈసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ఉదయం ప్రముఖ చర్మవ్యాధుల నిపుణురాలు ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్, ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి తదితర వ్యాధులకు వైద్య చికిత్సలు అందించనున్నారు. అలాగే చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు వి.ప్రతాప్‌రెడ్డి పలు సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు తెలిపారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని సూచించారు.

నేడు మహిళలకు పోటీలు

చెన్నూరు : సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఈనెల 12వ తేదీ శుక్రవారం ఉదయం 10 గంటలకు భారత జాతీయ కళా వారసత్వ పరిరక్షణ సంస్థ ఆధ్వర్యంలో చెన్నూరులోని వెలుగు కార్యాలయం ఆవరణలో మహిళలకు ముగ్గులు, మ్యూజికల్ చైర్స్ తదితర విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు సంస్థ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న మహిళలందరూ నిర్ణీత సమయానికి పోటీల్లో పాల్గొనాలని కోరారు. పోటీలు ముగిసిన వెంటనే విజేతలకు బహుమతులు అందజేస్తామని తెలిపారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

వల్లూరు : మండల పరిధిలోని రెండు గ్రామాల్లో శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథరెడ్డి, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి పర్యటించనున్నారని వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్, మాజీ జెడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదట మండలంలోని తప్పెట్ల గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాలను ప్రారంభిస్తారని పేర్కొన్నారు. అనంతరం దుగ్గాయపల్లె గ్రామంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లీనిక్ భవనాలను ప్రారంభిస్తారని తెలిపారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్ఆర్ సీపీ నేతలు ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

నేడు ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం

వల్లూరు : మండలంలోని కోట్లూరు గ్రామ సచివాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష రెండవ విడత కార్యక్రమంలో భాగంగా ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని ఎంపీడీఓ జయశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్య శిబిరంలో పలువురు వైద్య నిపుణులు హాజరై వైద్య సేవలను అందిస్తారని తెలిపారు. సచివాలయ పరిధిలోని గ్రామాలకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేడు సామాజిక తనిఖీపై ఓపెన్ ఫోరం

జమ్మలమడుగు : మండల పరిధిలోని 14 పంచాయతీ గ్రామాలలో జరిగిన ఉపాధి హామీ పనులపై ఓపెన్ ఫోరం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాఘవేంద్ర పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ 2022 ఏప్రిల్ ఒకటో తేది నుంచి 23 మార్చి 31వతేదీ వరకు జరిగిన పనులపై శుక్రవారం ఉదయం పది గంటలకు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో సామాజిక తనిఖీ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు సంబంధిత అధికారులందరూ తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు.

21న అవగాహన సదస్సు

కడప ఎడ్యుకేషన్ : ఈ నెల 21న ఆదాయ పన్ను లెక్కింపుపై ఏపీటీఎఫ్ అమరావతి ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు సివి ప్రసాద్ తెలిపారు. ఈ సదస్సు కడపలోని ఎన్జీవో భవనంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

కడప కార్పొరేషన్ : ప్రజా సంక్షేమమే భారత చైతన్య యువజన పార్టీ లక్ష్యమని ఆ పార్టీ రాష్ట్ర సమన్వయ సారథి పండిట్ డేవిడ్ తెలిపారు. గురువారం కడపలోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు..'



ఎర్రగుంట్లలోని 2వ వార్డులో పథకాల లబ్ధి గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డి



వైఎస్సార్‌సీపీలోకి చేరిన కుటుంబాలతో ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డి

జమ్మలమడుగు ఎమ్మెల్యే డాక్టరు మూలె సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : వాడవాడలలో ప్రజా సమస్యలను పరిష్కరించాలనే ప్రధాన లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ప్రవేశ పెట్టారని జమ్మలమడుగు ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం 2వ వార్డులో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డి ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ వార్డు వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు వర్రా డెవిడ్ వారికి ఘన స్వాగతం పలికి వార్డులోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణను చూసి ప్రతిపక్షాలు బెంబేలెత్తుతున్నాయన్నారు. కుల, మత బేధాలు చూడకుండా, రాజకీయాలు చేయకుండా పార్టీలకు అతీతంగా పథకాలు అందించాలన్నదే సీఎం వైఎస్ జగనన్న లక్ష్యమన్నారు.

మున్సిపల్ వైస్ చైర్మన్ చంద్రకళ వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకుడు వర్రా డెవిడ్, 3వ వార్డు కౌన్సిలర్ భాస్కర్, పార్టీ నాయకులు మాడిశెట్టి శివ, బాలాజీ, నాగేష్, నాగేంద్ర, 2వ వార్డు సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి పలు కుటుంబాలు చేరిక

2వ వార్డులోని ఉన్న చాపల రామచంద్ర, షేక్ రహమతుల్లాతో పాటు మరో ఐదు కుటుంబాలు వైఎస్సార్‌సీపీ పార్టీ నాయకుడు వర్రా డెవిడ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టరు ఎం సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎం హర్షవర్ధన్‌రెడ్డిల సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరారు. వీరికి నేతలు పార్టీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

జెడ్పీటీసీని విమర్శించే హక్కులేదు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు

వేంపల్లె : స్థానిక జెడ్పీటీసీ రవికుమార్‌రెడ్డిని విమర్శించేస్థాయి టీడీపీ మండల కన్వీనర్ రామమునిరెడ్డికి లేదని వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు ధ్వజమెత్తారు. గురువారం స్థానిక గండి రోడ్డులో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. 30ఏళ్ల నుంచి వివిధ పదవుల ద్వారా వేంపల్లె మండలాభివృద్ధికి విశేష సేవలు అందించిన ఘనత జెడ్పీటీసీ ఎం.రవికుమార్‌రెడ్డిదేనన్నారు. ఆయనపై టీడీపీ నాయకులు బీటెక్ రవి, రామమునిరెడ్డి చౌకబారు విమర్శలు చేయడం సమంజసం కాదన్నారు. సీఎం సొంత నియోజకవర్గం పులివెందుల తర్వాత వేంపల్లె మండలం ఎంతో అభివృద్ధి జరిగిందని, నాలుగున్నరేళ్ల కాలంలో రూ.500కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు జరిగాయని, వాటిని చూసి ఓర్వలేక జెడ్పీటీసీపై లేనిపోని ఆరోపనలు చేయడం సరికాదన్నారు. పాఠశాల కమిటీ చైర్మన్ కూడా గెలవలేని స్థాయి రామమునిరెడ్డిది అని పేర్కొన్నారు. గిడ్డంగివారిపల్లె మినీ రిజర్వాయర్ ద్వారా చుట్టూ ఉన్న గ్రామ ప్రజలకు సాగు, తాగునీరు అందుతుందన్నారు. దీనికోసం సీఎం వైఎస్ జగన్ శ్రద్ధ చూపి రూ.198కోట్ల వ్యయంతో మినీ రిజర్వాయర్ మంజూరు చేశారన్నారు. అందుకు సంబంధించి అభివృద్ధి పనులు త్వరితగతిన చేపట్టేందుకు అధికారుల సూచనల మేరకు సమీపంలోని పాపాఘ్ని నది నుంచి ఇసుక, అలవలపాడు నుంచి బంక మట్టి తోలుతుంటే టీడీపీ నాయకులు అర్థంపర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. 14ఏళ్ల మాజీ సీఎం చంద్రబాబు హయాంలో వేంపల్లె మండలంలో కనీసం రూ.5కోట్ల మేర అభివృద్ధి జరిగిందా.. జరిగుంటే నిరూపిస్తావా? అని ఎంపీటీసీలు సవాల్ విసిరారు. పట్టణాభివృద్ధిలో భాగంగా రోడ్డు విస్తరణకు సంబంధించి జెడ్పీటీసీపై అవినీతి ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. దీనిపై ఏ చర్చకైనా సిద్ధమే అంటూ వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలు సవాల్ విసిరారు. ఎంపీపీ లక్ష్మిగాయత్రి, మండల ఉపాధ్యక్షుడు బాబా షరీఫ్, ఎంపీటీసీలు కటిక చంద్రశేఖర్, మణిగోపాల్‌రెడ్డి, భారతి, హబీబుల్లా, కొండయ్య, బ్రహ్మయ్య, కో.ఆప్షన్ అస్వానయ్య, తదితర వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలి

– వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో త్వరలో రాబోయే సార్వత్రిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కె. సురేష్ బాబు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో క్లస్టర్ పార్టీ అధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్లు, కార్పొరేటర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులతో నిర్వహించిన సమావేశంలో అయన మాట్లాడుతూ ఎన్నికలకు ఎంతో దూరం లేదని, ప్రతి ఒక్కరూ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని తమ డివిజన్లలో చురుగ్గా పనిచేయాలన్నారు. బూత్‌లెవెల్ ఏజెంట్ల నియామకం, ఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు వంటి వాటిపై దృష్టి పెట్టాలన్నారు. చనిపోయిన వారు, దొంగ ఓట్లు ఉన్నట్లయితే వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపు, చేనేత ఇతర కులస్తులకు ప్రభుత్వం చేస్తున్న మంచిని తెలపాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే ఈ పథకాలు కొనసాగుతాయన్నారు. చంద్రబాబు ఇచ్చే గ్యారెంటీలు, ష్యూరిటీలను నమ్మేందుకు ప్రజలు సిద్ధంగా లేరన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అహమ్మద్‌బాషా, జమాల్‌వలీ, సుబ్బారెడ్డి, హరూన్ బాబు పాల్గొన్నారు.

రైతాంగ వ్యతిరేక చర్యలు ఆపాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : బీజేపీ ప్రభుత్వం వ్యవసాయాన్ని కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి. ఈశ్వరయ్య పేర్కొన్నారు. గురువారం నగరంలోని వైఎస్ఆర్ మెమోరియల్ ప్రెస్ క్లబ్‌లో విలేకర్లతో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు వ్యవసాయాన్ని లాభసాటిగా మారుస్తామని చెప్పిన మోడీ అధికారంలోకి వచ్చి రైతాంగ వ్యతిరేక చర్యలకు పాల్పడ్డారన్నారు. ప్రతి ఏటా పంటల సాగుకు ఖర్చులు పెరిగాయన్నారు. పెట్టుబడికి తగ్గట్టు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మూలె వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ విద్యార్థుల ప్రతిభ

వైవీయూ : దక్షిణ భారతదేశ స్థాయి యువజనోత్సవాలలో రాణించిన విద్యార్థులను వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి అభినందించారు. వైజాగ్‌లోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు జరిగిన దక్షిణ భారతదేశ యువజనోత్సవాలలో వైవీయూ లలితకళల విద్యార్థులు ప్రతిభ చాటారు. రంగోలిలో రమాజ్యోతి ప్రథమస్థానం, పెయింటింగ్‌లో అరవింద్ ఐదో స్థానం, కార్టూన్‌లో తృతీయ స్థానం, పోస్టర్ మేకింగ్‌లో దేవదాసుకు తృతీయ స్థానం, ఇన్‌స్టలేషన్ విభాగంలో అయుష్ బృందం ముత్యం, సింహాద్రి, బలరాముడులకు 5వ స్థానం, ఫొటోగ్రఫీలో షేక్ హుసేన్‌కు నాలుగో స్థానం, మెహందీ ఆర్ట్స్‌లో కె.శ్రీలతకు తృతీయ స్థానం లభించింది. విజేతలంతా విశ్వవిద్యాలయానికి చేరుకొని వీసీని కలిశారు. వీసీ వారిని అభినందించారు. కార్యక్రమంలో పీఆర్ సెల్ సంచాలకులు డా. ఎస్వీ సుబ్బారెడ్డి, యూనివర్శిటీ కల్చరల్ కోఆర్డినేటర్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ఆచార్య పుత్తా పద్మ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

యోగివేమన విశ్వవిద్యాలయం సమాజ సేవలో భాగసామ్యం అవుతోందని వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. వైవీయూ జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో గురువారం పెండ్లిమర్రి మండలం మిట్టమీదపల్లెలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వీసీ వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ వైవీయూ సేవలు పల్లెలకు విస్తరిస్తున్నాయన్నారు. విశ్వవిద్యాలయ కళాశాల ప్రధానాచార్యులు పాల్గొన్నారు.

రేపు దూదేకుల కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

కడప సెవెన్‌రోడ్స్ : దూదేకుల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన ఓం రసూల్‌ను శనివారం సన్మానిస్తున్నామని దూదేకుల భవన కమిటీ, బీసీ సంక్షేమ నాయకులు ఓబులేశు, అజంతుల్లా, లింగమూర్తి, శ్రీను,గోవిందునాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13వ తేదీ ఉదయం 10.15 గంటలకు కడప ఐఎంఏ హాలులో ఈ సన్మాన సభ ఉంటుందన్నారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాష, మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు. జిల్లాలోని దూదేకుల కులస్తులు కార్యక్రమానికి హాజరు కావాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని కడప రోడ్డు విస్తరణకు సంబంధించి కరెంటు లైన్ షిఫ్టింగ్ పనులు జరుగుతున్న సందర్భంగా శుక్రవారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని విద్యుత్ ఏఈ జగదీశ్వరరెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని గమనించి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఘనంగా జాతీయ యువజనోత్సవం

కడప ఎడ్యుకేషన్ : కడప నగరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్, స్కిప్పింగ్, పరుగు పందేలను నిర్వహించారు. సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో జానపద నృత్యం, జానపద గేయం, వకృత్వ, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెట్ప్ సీఈఓ సాయిగ్రేస్ పాల్గొని మాట్లాడారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. అనంతరం విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సూర్యారావు, ఎన్ఎస్ఎస్ అధికారులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకుని రాయల్ కరీం సేవా సమితి ఆధ్వర్యంలో ముద్రించిన పోస్టర్‌ను గురువారం కడప యూటీఎఫ్ కార్యాలయంలో ఆ సంఘ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజా విడుదల చేశారు. ఈ సందర్భంగా లక్ష్మిరాజా మాట్లాడుతూ జనవరి 12వ తేదీన స్వామి వివేకానంద జయంతిని రాష్ట్ర యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. యువత ముందుకొచ్చి రక్తదానాలు చేసి సామాజిక సేవ కార్యక్రమం చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాయల్ కరీ ముల్లా తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి మాచుపల్లె దర్గా ఉరుసు

కడప కల్చరల్ : ఈనెల 14వ తేదీ నుంచి మాచుపల్లె దర్గా ఉరుసు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ ప్రతినిధులు, ముజావర్ సయ్యద్ సలావుద్దీన్ తెలిపారు. హజరత్ సయ్యద్‌షావలి సాహెబ్‌గా పేరున్న ఈ ఉరుసు ఉత్సవంలో భాగంగా ఆదివారం రాత్రి 9 గంటలకు ఫకీర్ల మేళతాళాలతో గంధం, పూలచాందిని గ్రామంలో ఊరేగింపు, సమర్పణ ఉంటుందన్నారు. సోమవారం రాత్రి ఉరుసు ఉత్సవం జరుగుతుందని, మంగళవారం తహలీల్ ఫాతెహా ఉంటాయన్నారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న మండల స్పెషలాఫీసర్ బ్రహ్మయ్య

వల్లూరు : మండలంలో జరుగుతున్న పక్కా గృహ నిర్మాణాలను వీలైనంత త్వరగా పూర్తి చేయడానికి అధికారులు పూర్తి స్థాయిలో కృషి చేయాలని మండల స్పెషలాఫీసర్ వి. బ్రహ్మయ్య పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో మండల స్థాయి అధికారులు, గ్రామ పంచాయతీల కార్యదర్శులతో గురువారం వివిధ అంశాలపై జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా మండలంలో జరుగుతున్న గృహ నిర్మాణాల ప్రగతిని గురించి చర్చించారు. జగనన్న కాలనీల్లో మౌళిక సదుపాయాల కల్పనలో ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని అన్నారు. మండల పరిధిలోని గ్రామాల్లో పారిశుద్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. గ్రామ సచివాలయాల్లోని సిబ్బంది ఉదయం, సాయంత్రం తప్పనిసరిగా బయోమెట్రిక్ వేసేలా చూడాలని ఆదేశించారు. ఎంపీడీఓ జయశ్రీ, డిప్యూటీ తహశీల్దార్ సుహాసిని, ఈవోపీఆర్‌డీ ప్రసాద్, ఎంఈవో –2 విజయారెడ్డి, ఏపీఎం శైలజ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మన సంకల్పం వికసిత భారత్



వికసిత భారత్ గురించి ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీఓ జ్యోతి

కమలాపురం : మన సంకల్పం వికసిత భారత్ అని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారని బీజేపీ జిల్లా నాయకులు సురేష్ కుమార్‌రెడ్డి, రామ్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎంపీడీఓ జ్యోతి అధ్యక్షతన జంబాపురం గ్రామంలో వీక్షిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి ప్రత్యేక మొబైల్ వాహనం లోని వీడియో ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం జారీ చేసిన ప్రతిజ్ఞ చేయించారు. సర్పంచ్ ఇందిరెడ్డి శ్రీనువాసులరెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, ఆర్ఐ శ్రీకాంత్, ఏపీఎం అపర్ణ,హౌసింగ్ ఏఈ ప్రతాప్‌రెడ్డి, ఏపీఓ పార్థసారధి, ఈఓఆర్‌డీ శారదారెడ్డి, బీజేపీ నాయకులు లక్ష్మీ నారాయణరెడ్డి, గోవర్ధన్ పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, తదితరులు

పులివెందుల టౌన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 125అడుగుల విగ్రహం ఆవిష్కరణ సందర్భంగా పట్టణంలోని పెద్దకొండప్ప కాలనీ, శ్రీరామ్ టెంపుల్, ఎస్‌బీఐ కాలనీ సచివాలయాల పరిధిలో అంబేద్కర్ స్మరణ కార్యక్రమం, సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. గురువారం స్థానిక నలంద పాఠశాల ఆవరణంలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, జేసీఎస్ ఇన్‌చార్జిలు పార్నపల్లె కిశోర్, చంద్రమౌళిలు అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మీప్రసన్న, భార్గవి, రజియా, గుల్జర్, కొండ్రావు, రామాంజనమ్మ, ఖాదర్, రంగనాయకులు, వెంకటసుబ్బయ్య, నాగరాజు, సంపత్, మోట రాజా, డేనియల్, మస్తాన్, రవి, శ్రీరాములు, కోళ్ల భాస్కర్, మూర్తి, రాజేష్, ప్రేమ్ చంద్, కిరణ్, కో–ఆప్షన్ సభ్యుడు చంద్రమౌళి పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్ కోసం క్యూ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : జిల్లాలోని వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్ కోసం రవాణాశాఖ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. జిల్లాలో వాహనాలను పోలీసులు తనిఖీ చేస్తూ ఫైన్‌లు విధిస్తుండడంతో డ్రైవింగ్ లైసెన్స్ కోసం రవాణా శాఖ కార్యాలయానికి పరిగెడుతున్నారు. రోజుకు డ్రైవింగ్ లైసెన్సులు కోసం దాదాపు 200 మంది వాహనదారులు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకొని ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ పరీక్షకు వస్తున్నారు. ఇందుకు తగ్గట్టుగా రవాణా శాఖ అధికారులు తగిన సదుపాయాలను కల్పించారు.

రసవత్తరంగా మండలస్థాయి ఆడుదాం ఆంధ్రా పోటీలు

కమలాపురం : రాష్ట్ర వ్యాప్తంగా సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రూ.12కోట్ల ప్రైజ్ మనీ ఏర్పాటు చేసి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయం అని హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక సీఎస్ఐ చర్చీ గ్రౌండ్‌లో జరుగుతున్న ఆడుదాం.. ఆంధ్రా మండల స్థాయి క్రికెట్, వాలీబాల్ క్రీడలను బ్యాటింగ్ చేస్తూ ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం ప్రకటించిన ప్రైజ్ మనీకి అదనంగా మన ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి సొంత నిధులతో ప్రైజ్‌మనీని పెంచడం సంతోషకరమన్నారు. గురుకుల పాఠశాలలో కబడ్డీ, ఖో-ఖో తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. మండల స్పెషలాఫీసర్ నరసింహారెడ్డి, ఎంపీడీఓ జ్యోతి, కమీషనర్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

రెండవ రోజు .. ఆడుదాం ఆంధ్ర క్రీడలు

చెన్నూరు : రెండవ రోజు మండల స్థాయిలో ఆడదాం ఆంధ్ర క్రీడా పోటీలు మండల అధికారుల ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు, కొండపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మహిళలకు ఖోఖో, వాలీబాల్ కబడ్డీ, మహిళల క్రికెట్ పోటీలను నిర్వహించారు. అదేవిధంగా ఉప్పరపల్లె గ్రౌండ్ లో పురుషులకు క్రికెట్ పోటీలు, చెన్నూరు పార్కులో వాలీబాల్‌తో పాటు బ్యాడ్మింటన్ క్రీడలు నిర్వహించారు. రెండవ రోజు మండల స్థాయిలో పార్కులో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలలో చెన్నూరు–2కు చెందిన మహిళలు విజేతలుగా నిలిచారని వీరందరూ కూడా నియోజకవర్గ స్థాయిలో జరిగే క్రీడా పోటీలలో పాల్గొంటారని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం శర్మ తెలిపారు.

రసవత్తరంగా సాగిన క్రికెట్ పోటీలు

వీరపునాయునిపల్లె : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు జరిగిన క్రికెట్ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఇందుకూరు జట్టుపై యస్ పాలగిరి, వెల్లుర్తి జట్టుపై కొమ్మద్ది, ఉరుటూరు జట్టుపై పాయసంపల్లె, అలిదెన జట్టుపై తలపనూరు జట్టు విజయం సాధించాయి. శుక్రవారం కబడ్డి, వాలీబాల్, ఖో ఖో పోటీలు నిర్వహించనున్నారు. క్రికెట్ పోటీలకు రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ 10వేలు, మండల అధ్యక్షుడు రఘునాథ రెడ్డి 10 వేలు, ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి 5వేలు నగదు బహుమతిని ప్రకటించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి 15వేలు, రన్నర్స్‌గా నిలిచిన వారికి 10వేల రూపాయలు బహుమతిని అందజేయనున్నారు.



కమలాపురం : క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సంబటూరు ప్రసాద్‌రెడ్డి

రసవత్తరంగా 'ఆడుదాం ఆంధ్రా' పోటీలు

వేముల : గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు చేపట్టిన ఆడుదాం – ఆంధ్రా పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో 10రోజులపాటు ఈ పోటీలను నిర్వహించనున్నారు. ఈ నెల 10 నుంచి జరుగుతున్న మండలస్థాయి పోటీలు ఈనెల 20వ తేదీ వరకు జరగనున్నాయి. గ్రామీణ క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. అనంతరం నియోజకవర్గస్థాయిలో పోటీలను నిర్వహించనున్నారు.

ఉత్కంఠభరితంగా పోటీలు

లింగాల : మండల కేంద్రమైన లింగాల పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న క్రీడా మైదానంలో గురువారం ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. క్రికెట్ పోటీలలో కోమన్నూతల సచివాలయ జట్టు విన్నర్‌గా, పెద్దకుడాల సచివాలయ జట్టు రన్నర్‌గా నిలిచాయి. అలాగే బ్యాడ్మింటన్ పోటీలలో పార్నపల్లె సచివాలయ జట్టు విజేతగానూ.. వెలిదండ్ల సచివాలయ జట్టు రన్నర్‌గా నిలిచాయి. వాలీబాల్ పోటీలలో పార్నపల్లె సచివాలయ జట్టు విన్నర్‌గానూ.. వెలిదండ్ల సచివాలయ జట్టు రన్నర్‌గా నిలిచాయి. ఎస్ఐ రవికుమార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత యువకులు ఉత్సాహంగా క్రీడా పోటీలలో పాల్గొని వారి నైపుణ్యాన్ని వెలికి తీయాలన్నారు. ఎంపీడీఓ సురేంద్రనాథ్, ఎస్ఐ రవికుమార్, వైఎస్సార్ సీపీ మండలస్థాయి నాయకులు అలవలపాటి మల్లికార్జునరెడ్డి, నాగశేషులరెడ్డి, గంగాధరరెడ్డి, బాబా హుస్సేన్ తదితర సర్పంచ్‌లు పాల్గొన్నారు.



వేములలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



లింగాల : మాట్లాడుతున్న ఎస్ఐ రవికుమార్



సింహాద్రిపురం : మండలస్థాయి వాలీబాల్ విన్నర్‌గా నిలిచిన గురిజాల బాబావల్లి జట్టు క్రీడాకారులు



వేంపల్లె : కబడ్డీలో గెలుపొందిన వీరన్నగట్టుపల్లె క్రీడాకారులతో కావలి కృష్ణతేజ, తదితరులు

వాలీబాల్‌లో విన్నర్‌గా గురిజాల సచివాలయం జట్టు

సింహాద్రిపురం : మండల కేంద్రమైన సింహాద్రిపురం వైఎస్ఆర్ఆర్ జూనియర్ కళాశాలలో గురువారం జరుగుతున్న ఆడుదాం ఆంధ్ర ఆటల మండలస్థాయి పోటీలకు 12 సచివాలయాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో పురుషుల వాలీబాల్‌లో గురిజాలకు చెందిన బాబావలి జట్టు విన్నర్‌గా, అలాగే మహిళల వాలీబాల్‌లో హిమకుంట్ల గంగోత్రి జట్టు విన్నర్‌గా నిలిచాయని ఎంపీడీఓ కృష్ణమూర్తి తెలిపారు. అలాగే పురుషుల ఖోఖోలో కోవరంగుంటపల్లె సచివాలయ జట్టు, మహిళల ఖోఖోలో సుంకేసుల సచివాలయ జట్టు, మహిళల కబడ్డీలో పైడిపాలెం మండలస్థాయి విన్నర్ జట్లుగా నిలిచాయన్నారు. పీఈటీ విక్టర్ పాల్గొన్నారు.

గ్రామానికి మంచి పేరు తీసుకరావాలి

వేంపల్లె : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులు క్రీడలలో రాణించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకులు కావలి కృష్ణతేజ ఆకాంక్షించారు. గురువారం స్థానిక జెడ్పీ హైస్కూలు ఆడుదాం – ఆంధ్రా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కబడ్డీ పోటీలలో వీరన్నగట్టుపల్లె గ్రామం విజయం సాధించడంపట్ల ఆయన హర్షం వ్యక్తం చేస్తూ క్రీడాకారులను ప్రోత్సహించారు. ఎంపీడీఓ దివిజ సంపతి, పీడీ రాజశేఖర్, సచివాలయ కార్యదర్శి శ్రీనివాసులు, కన్వీనర్ పోతిరెడ్డి శ్రావణ్, క్రీడాకారులు పాల్గొన్నారు.